క్లుప్తంగా

తెగిపడిన విద్యుత్ వైర్లు

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో శనివారం సాయంత్రం గాలివానకు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఘటనా స్థలంలో ఎలాంటి కట్టడాలు, జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొత్తపల్లి గ్రామం మీదుగా అల్లంపల్లి గేట్ సమీపంలో ఉన్నా మిషన్ భగీరథ నీటి సరఫరా (ట్యాంకులకు)కేంద్రంకు ఈ వైర్ల ద్వారానే విద్యుత్ సరఫరా జరుగుతుంది. వైర్లు తెగిపడడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకుని విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి వైర్లను తొలగించారు.

ఆర్టీసీ అధికారికి ఆత్మీయ వీడ్కోలు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో చాలా కాలంగా ఆయిల్ సెక్షన్ డీసీగా విధులు నిర్వహిస్తున్న టీఐ–3 వహిదోద్దీన్‌కు కార్మికులు శనివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎం ఆంజనేయులు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిపోలో ఎంతో నిబద్ధతతో పనిచేసి, ఎంతో మంది మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమన్నారు. సూపరింటెండెంట్ నరేందర్, ఎంఎఫ్ రాజశేఖర్, ఎస్టీఐ నజీర్‌షేక్, సీఆర్‌సీ ఆంజనేయులు, నాయకులు శ్రీశైలం, నాగేందర్, అహ్మద్‌ఖాన్, మధు, మన్యం, బద్రి పాల్గొన్నారు.

పరేడ్‌తో ఆరోగ్యవంతమైన జీవితం

నారాయణపేట రూరల్ : నిత్యం ఆసనాలు వేయడం, యోగా చేయడంతో పాటు వారానికి ఒకసారి పరేడ్‌లో పాల్గొంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందుతామని ఆర్ఐ విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులకు వీక్లీ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసులకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని, అందుకు ప్రతి ఒక్కరు రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. సమయపాలన, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. సర్వీసులో ఏమైనా సమస్యలు ఉంటే ఎస్పీని కలిసి పరిష్కరించుకోవాలన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

నారాయణపేట రూరల్ : రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకుని ఉండాలని పోలీసు అధికారులు అన్నారు. ప్రతి నెలా చివరి పనిదినం జిల్లాలో సివిల్‌రైట్స్ డే నిర్వహించాలనే ఎస్పీ ఆదేశాలతో జిల్లాలోని ప్రతి పీఎస్ పరిధిలో ఒక గ్రామం ఎంపిక చేసి శనివారం కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు పోలీసులు ఆయా గ్రామాలకు వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు. ప్రతీ పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛగా జీవించే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందన్నారు. బీద, ధనిక తేడా లేకుండా అందరు సమానంగా సేవలను పొందవచ్చని చెప్పారు. ప్రార్థనా మందిరాలు, ఇతర వ్యాపార కేంద్రాల్లో సమానత పాటించకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

పూజ చేస్తుండగా ఇల్లు దగ్ధం

మక్తల్: పట్టణంలో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఆనంద్ ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. విలువైన సామగ్రి కాలిపోయింది. దాదాపు రూ.20 వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితుడు కోరారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు చేసి రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యమన్నారు. రుద్రసముద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి ఎల్లవేళలా కృషిచేస్తానన్నారు. రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీటిని విడుదల చేయడంతో రైతులకు సాగులో ఎంతో మేలు జరిగిందని అన్నారు. నేరుగా రైతుకు ప్రతి పైసా చెల్లిస్తామని అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలో దోబీ ఘాట్ల కోసం రూ. 2.50కోట్లు మంజూరు చేశామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయం సాధారణ సమావేశం శనివారం నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. మక్తల్‌లో కుక్కలను తరలించాలని ఆదేశించారు. మున్సిపల్ సమావేశాలకు అడిషన్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేసినా నేటి వరకు బిల్లులు రాలేదని కౌన్సిలర్లు ప్రసన్నరెడ్డి, కొండయ్య, శంకరమ్మ, చీరాల సత్యనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాగా పట్టణ అభివృద్ధి కోసం అందరు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. మక్తల్‌లో దాదాపు రూ.5 కోట్ల వరకు సీసీ రోడ్డు పనులు చేపట్టామన్నారు. అదేవిధంగా వివిధ అంశాలకు సంబంధించిన పనుల నిర్వహణ తదితరాలపై సమావేశంలో తీర్మాణాలు చేసి ఆమోదం తెలిపారు. పాత వెటర్నరీ ఆస్పత్రి వద్ద మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి తిరస్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ అఖిలారెడ్డి, కమిషనర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లిలో శనివారం వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సత్యమ్మ సమక్షంలో ఎంపీపీ నర్సప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రైవేటు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి అరవింద్, ఎంపీటీసీ లక్ష్మి, చంద్రశేఖర్, తిప్పణ్ణ, రాములు, భీంరెడ్డి , కన్కిరెడ్డి తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

నర్వ: సీపీఆర్‌పై అవగాహన అవసరమని నర్వ పీహెచ్‌సీ వైద్యులు కేశవ్ అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సీపీఆర్‌పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కాళప్ప, ఎస్ఐ విక్రమ్, రెవిన్యూ, పంచాయతీరాజ్, అంగన్‌వాడీ, పోలీస్‌శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారిణి శ్రీలత శనివారం పోలీసులకు, అంగన్‌వాడీ టీచర్లకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎఎస్ఐ గోపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, పోలీసులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



గోపాల్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్స్ కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష తన చాంబర్‌లో ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేసి మాట్లాడారు. పోటీ పరీక్షలలో మంచి ర్యాంక్‌ను సాధించాలన్నారు. జిల్లాతో పాటు తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా షెడ్యుల్ కులాల సంక్షేమ అధికారి కన్యాకుమారి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడు గోపాల్‌కు కలెక్టర్ హామీ

కోస్గి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీహర్ష ప్రజావాణి కార్యక్రమం నిర్వహించేందుకు శనివారం వచ్చారు. అదే సమయంలో అనుకోకుండా ప్రభుత్వం నుంచి మూడు చక్రాల బండి కోసం దరఖాస్తు చేసుకోవాలని కులం, ఆదాయ ధ్రువీకరణ కోసం శనివారం దివ్యాంగుడు గోపాల్ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా గోపాల్‌ను గమనించిన కలెక్టర్ ఆయనను చాంబర్‌లోకి పిలిపించుకొని సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి బ్యాటరీతో నడిచే మూడు చక్రాల బండికి దరఖాస్తు చేసుకుంటున్నానని, అదే విధంగా ప్రభుత్వం నుంచి రుణం ఇప్పిస్తే మూడు చక్రాల బండిపై చేతనైన వ్యాపారం చేసుకోని జీవనోపాధి పొందుతానని గోపాల్ వివరించారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. పలుమార్లు కలెక్టర్‌ను కలిసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదని, ఈ రోజు నేరుగా కలెక్టర్‌తో మాట్లాడడం సంతోషంగా ఉందని అన్నాడు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నగదు అందిస్తున్న దండు అయ్యన్న

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ దేవత జములమ్మ ఆలయానికి బీఆర్ఎస్ నాయకులు దండు అయ్యన్న విరాళం అందించారు. ఈ సందర్భంగా శనివారం రూ. 2.50 లక్షలు నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా దండు అయ్యన్నను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ లక్ష్మన్న, శ్యాంసుందర్‌రెడ్డి, పెద్దచెన్నప్ప, గోవు చంద్రప్ప, ముమ్మలి రాములు, శ్రీనువాసులు, నజీర్ తదితరులున్నారు.

ప్రశాంతంగా పరీక్ష



నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన నవోదయ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నాలుగు కేంద్రాల్లో 810 మందికి గానూ 729 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ లియాకత్‌అలీ పరిశీలించారు. గంట ముందుగానే విద్యార్థులను కోవిడ్ నిబంధనలతో లోపలికి అనుమతించారు. 60 మంది ఉపాధ్యాయులు విధుల్లో పాల్గొన్నారు.

ఘనంగా నృత్య దినోత్సవం

నారాయణపేట రూరల్ : పట్టణంలోని బాలకేంద్రం ఆవరణలో శనివారం అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు పంచారు. అనంతరం కూచిపుడి శిక్షకురాలు జ్ఞానామృతను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న యువతరంలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు సంప్రదాయ నృత్యాలతో మార్పును తీసుకుని రావడం అభినందనీయమన్నారు. కనుమరుగవుతున్న కళలకు జీవం పోస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, తెలుగు అధ్యాపకురాలు పద్మావతి, సంగ నర్సింహులు, వసంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

మేడే వాల్ పోస్టర్ విడుదల

కృష్ణా: మండల పరిధిలోని హిందుపూర్, కృష్ణా గ్రామాల్లో శనివారం మే డే వాల్‌పోస్టర్‌లను ఐఎఫ్‌టీ యూ నాయకులు విడుదల చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ బుట్టో కార్యక్రమంలో కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం కృషిచేయాలని కోరారు. పంచాయతి కార్మికులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లి, సమస్తాపూర్ గ్రామాల్లో శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి కనకరాయుడు మాట్లాడుతూ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు హనుమంతు, కిష్టప్ప, ఎల్లప్ప, కాశీం తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీలను రద్దు చేయాలి

కృష్ణా: పర్యావరణాన్ని నాశనం చేసే కెమికల్ ఫ్యాక్టరీలను వెంటనే రద్దు చేయాలని చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని హిందూపూర్ సర్పంచ్‌తో పాటూ ప్రజలతో చర్చించామని, ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తనూర్ మాదిరిగానే ఇక్కడా ఏర్పాటు చేస్తున్న ఫ్యాక్టరీ వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.సమావేశంలో నాయకులు విజయ్ కుమార్, మోతిలాల్, మురళీ తదితరులు ఉన్నారు.

చెక్కులు అందజేసిన కిషన్‌రెడ్డి

నారాయణపేట టౌన్ : కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు సహాయనిధి చెక్కులను అందజేశారు. నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన విద్యావతికి రూ. 24 వేలు, నారాయణపేట పట్టణం బహార్‌పేటకు చెందిన మాధవికి రూ. 42 వేల విలువైన చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రహరీ కూల్చివేతపై ఫిర్యాదు



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో శ్రీకృష్ణదేవాలయ ప్రహరీని గ్రామానికి చెందిన పుష్పాంజలిదేవి జేసీబీతో కుల్చివేయించారు. ఘటనపై సర్పంచ్ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు, రాఘవేందర్‌రెడ్డి, బుగ్గప్ప స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో తెలిపిన వివరాల ప్రకారం..సదరు మహిళ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆలయం వెనుక ఆమెకు చెందిన భూమి ఉండడంతో దారి కోసం ప్రహరీని కూల్చివేసి రోడ్డుగా మార్చేందుకు ప్రయత్నించారు. విషయంపై సర్పంచ్ అడ్డుకోగా గుడి తమ స్థలంలోనే ఉందని తగాదా పెట్టుకున్నారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

మక్తల్: విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాలకు చెందిన హన్మంతుకు చెందిన ఎద్దు పొలంలో మేతకు వెళ్లిన క్రమంలో చాలా తక్కువ ఎత్తులో వేలాడుతున్న కరెంటు తీగలకు ప్రమాదవశాత్తు తగిలింది. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు మృతి చెందడంతో రూ. 60 వేల నష్టం వాటిల్లిందని రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ర్యాలీ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

నారాయణపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీలో నిరుద్యోగులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. శనివారం నారాయణపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అబద్ధపు హామీలతో నిరుద్యోగులను మోసం చేశాయన్నారు. కాంగ్రెస్ నిరుద్యోగులకు అండగా నిలిచిందన్నారు. ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ ఎన్నో పోరాటాలను చేసిందన్నారు. అధికారంలోకి రాగానే నెలరోజుల్లోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తుందన్నారు. నాయకుడు నర్సింహులు ముదిరాజ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ గౌస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుధాకర్ ఉన్నారు.

కోస్గి: మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్ కుమార్, కోస్గి, గుండుమాల్ మండలాల అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, నాచారం వెంకట్రాములు, సురేష్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలో కాంగ్రెస్ అధ్యక్షుడు వీరన్న, నాయకులు కృష్ణయ్య, రామకృష్ణ మాట్లాడారు. హరీష్, ఆంజనేయులు, రఘు, మొగులప్ప, సత్యన్న, చెన్నయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

నర్వ: మండలంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేక్‌వర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: నిరుద్యోగ నిరసన ర్యాలీకి తరలి రావాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహా శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

నారాయణపేట రూరల్: జేఈఈ మెయిన్స్‌కు సంబందించి శనివారం విడుదలైన ఫలితాల్లో పట్టణంలోని విద్యార్థులు ప్రతిభ చాటారు. మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన సాయికుమార్ 92.83 శాతం సాధించాడు. ఈ విద్యార్థినీ మైనార్టీ జిల్లా సంక్షేమ అధికారి గోవిందరాజన్, కోఆర్డినేటర్ ఖాజాబహుద్దీన్, ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి అభినందించారు. అదేవిధంగా ఎస్‌వీఎస్ కళాశాలకు చెందిన వెంకటేష్ 96.59, పీడబ్ల్యూడీ కేటగిరిలో రాఘ మయూరి 66.6 శాతంతో అర్హత సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ శేషమ్మ, డైరెక్టర్లు గోపాల్‌రెడ్డి, కవిత అభినందించారు.

సన్మానం

నర్వ: ఇటీవల వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న మండల ఎంఈఓ లక్ష్మీనారాయణను శనివారం ఎంప్మార్సీలో ఘనంగా సన్మానించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సూరం వెంకటేష్, సీఆర్పీలు నర్సిములు, రోజా, సిబ్బంది రైసభాను, రాంరెడ్డి తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మక్తల్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పకుండా నిబంధనలు పాటించాలని మక్తల్ సీఐ సీతయ్య అన్నారు. శనివారం గుర్లపల్లి వెళ్లే రహదారి వద్ద సూచికలను ఏర్పాటు చేయించారు. జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవాలని సూచించారు. మక్తల్ ఎస్ఐ పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల దీక్ష

మక్తల్: పట్టణంలో వీఓఏలే చేపట్టిన దీక్ష నిరవధికంగా కొనసాగుతోంది. శనివారం 13వ రోజు వీఓఏలు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

మరికల్: యాసంగిలో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని, బాధిత రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకులు వేణు, కొండయ్య అన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఎకరాకు రూ. 20 వేలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు. బాధిత రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఎకరాకు రూ. 30 వేలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

రెగ్యులరైజేషనే లక్ష్యంగా 'పంచాయితీ'



కోస్గిలో ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె కొనసాగుతోంది. ఇప్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, తదితరులు మద్దతు తెలిపారు. అశోక్‌గౌడ్, మధు, రవికుమార్, అనిత, నర్సిములు, సుమన్, బాలరాజు, కనకరాజు, కురుమూర్తి, శ్రావణి, శివయ్య, విష్ణు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: మండలంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు శనివారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఎంపీడీఓ వెంకటయ్య, ఎంపీఓ రహమత్‌కు అందజేశారు. టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్ కుమార్, కోస్గి, గుండుమాల్ మండలాల అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, నాచారం వెంకట్రాములు, సురేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలో కొనసాగిన సమ్మెలో మండల సంఘం అధ్యక్షుడు కి శోర్, రాజు, రవికుమార్, నర్సప్ప, రేచల, లింగప్ప పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని నిర్వహించిన సమ్మెలో పంచాయతీ కార్యదర్శులు శనివారం తమ పిల్లలతో పాటు పాల్గొన్నారు. కేసీఆర్ తాత మా తల్లి, దండ్రుల ఉద్యోగాలు రెగ్యులర్ చేయండి అనే ఫ్లకార్డులను చిన్నారులు ప్రదర్శించారు. అచ్యుతానంద్, అమర్‌నాథ్‌గౌడ్, నరహరి, సాయినాథ్, అనురాధ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు మద్దతు తెలిపారు. అనంతరం వారితో పాటూ సహపంక్తి భోజనం చేశారు. నర్సింహారెడ్డి, మల్లేష్, భాస్కర్, శివశంకర్, రాములు, నర్సిములు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలో నిర్వహించిన సమ్మెలో చర్లపల్లి సర్పంచ్ రాములు, కిష్టాపూర్ సర్పంచ్ దామోదర్‌రెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు వెంకటేష్ కార్యదర్శులకు మద్దతు తెలిపారు. కార్యదర్శులు సుధ, పూర్ణచందర్‌రెడ్డి, చంద్రశేఖర్, రవేందర్, రఘువేందర్‌గౌడ్, షాహన్‌బేగం, శ్రీదేవి, నిర్మల ఉన్నారు.



మక్తల్‌లో సమ్మె చేపట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



మాగనూర్‌లో..

కోటకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి

నారాయణపేట రూరల్ : కోటకొండను మండల కేంద్రంగా చేయాలని అన్ని పార్టీల నాయకులతో కలిసి జేఏసీగా ఏర్పడి శనివారం సాధన సమితిని సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు కాశీనాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ పార్టీల నాయకులు బి.రాము, కెంచె శ్రీనివాస్, బలరాం, ఎడ్ల రాజు పాల్గొని మాట్లాడారు. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మే 10 నుంచి రిలేదీక్షలు చేయాలని తీర్మానించారు. సాధన సమితి కో–కన్వీనర్లుగా కాశీనాథ్, యాదగిరి, చెన్నప్ప, ప్రవీణ్, ప్రభంజన్‌రావు తదితరులను నియమించారు.

దళితులపై దాడులు అరికట్టాలి

నారాయణపేట రూరల్ : దళితులపై చేస్తున్న దాడులను అరికట్టాలని కోరుతూ శనివారం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లుకు దళిత సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కోస్గిలో దళిత వ్యక్తిపై అయ్యప్ప భక్తుల ముసుగులో దాడి చేశారని, మద్దూర్ మండలం నందిపాడులో శివస్వాముల పేరుతో తల పగలగొట్టారని, నారాయణపేట మండలం అభంగాపూర్‌లో అగ్రకులానికి చెందిన వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారని, దామరగిద్ద మండలం మల్‌రెడ్డిపల్లిలో బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. ఇలా ప్రతిచోటా అగ్రకులాల వారు దళితులపై దాడులు చేస్తున్నారని, వీటిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, చిన్నయ్య, చంటి, రమేష్, హన్మంతు, బీమేష్, కనకప్ప, భరత్, సోఫీ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు వినతి

నారాయణపేట రూరల్ : జిల్లా వైద్యశాఖలో భర్తీ చేసిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ పోస్టుల నియామకాల్లో అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతూ పీవైఎల్ నాయకులు స్థానిక డీఎంహెచ్ఓ డాక్టర్ రాంమనోహర్‌రావుకు శనివారం వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. మొత్తం 410మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 370మంది నాన్‌లోకల్ వారు ఉన్నారని, మెరిట్‌లిస్ట్‌లోని 12మంది సైతం బయటివారిని ఎంపిక చేశారని అన్నారు. అభ్యర్థుల్లో దాగివున్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రం, సలీం, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో వార్షికోత్సవాలు

ధన్వాడ: మండల కేంద్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రగతి పత్రాలను అందజేశారు. వేసవి నేపథ్యంలో చిన్నారుల తల్లిదండ్రులకు సూచనలు చేశారు. కార్యకర్తలు సంతోష, రాణి, శారద, భూదేవి, సావిత్రి, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.